క్లుప్తంగా

ఈవీఎంల మొరాయింపు.. స్వల్ప వివాదాలు

మాచవరం: మండలంలో ఎన్నికల పోలింగ్ నిర్వాహణ ప్రశాంతంగా ముగిసింది. ఓటు వేసేందుకు ఓటర్లు ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సాంకేతిక లోపాలతో ఈవీఎంలు మొరాయించాయి. పలు గ్రామాల్లో ఇరువర్గాల స్వల్ప వివాదాలు చోటు చేసుకున్నాయి. పోలీసులు ఇరు వర్గాలను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు తగిన పోలీస్ సిబ్బందిని నియమించకపోవడంతో ఓటర్లను కట్టడి చేసేందుకు నానా అవస్థలు పడ్డారు. సాయంత్రం 5.30 గంటల సమయానికి మండల వ్యాప్తంగా 79.95 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. వేమవరం, కొత్తపాలెం, చెన్నాయపాలెంలో క్యూ లైన్లో ఓటర్లు నిలుచోవడంతో పోలింగ్‌ను కొనసాగించారు.

కొద్దిరోజులు ఆగు.. నీ సంగతి చూస్తా !



నాదెండ్ల: బుక్కాపురం పోలింగ్ బూత్‌లో టీడీపీ నాయకుడు మల్లెల రాజేష్‌నాయుడు హల్‌చల్ చేశాడు. 48వ పోలింగ్ బూత్‌లో తూబాడు గ్రామ శివారు రాజుగారిపాలెం గ్రామ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారు. రాజుగారిపాలెం గ్రామానికి చెందిన దాట్ల విక్రమరాజు ఈ బూత్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోలింగ్ ఏజెంట్‌గా ఉన్నాడు. మధ్యాహ్న సమయంలో విక్రమరాజు పోలింగ్ బూత్ నుండి బయటకు వచ్చాడు. ఈ సమయంలో కొందరు టీడీపీ నేతలు అతన్ని దుర్భాషలాడి హెచ్చరికలు చేశారు. కొద్దిసేపటికి రాజేష్‌నాయుడు తన అనుచరులతో చేరుకుని పోలింగ్ బూత్‌లోకి చొరబడి హడావుడి చేశాడు. అక్కడకు వచ్చిన ఎస్సై జె బలరామ్‌రెడ్డిపై సైతం తీవ్రస్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డాడు. టీడీపీ ప్రభుత్వం రాగానే నీ సంగతి చూస్తానంటూ కేకలు వేసి దౌర్జన్యం చేశాడు.

మార్కెట్ యార్డు చైర్మన్‌పై టీడీపీ వర్గీయుల దాడి



నాదెండ్ల: చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గొంటు శ్రీనివాస రెడ్డిపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు ఆయన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చీఫ్ ఏజెంట్‌గా ఉన్నానని, ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో సాతులూరులో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ తన వర్గీయులపై కర్రలు, రాళ్ళు తీసుకుని దాడికి దిగాడన్నారు. కక్షతోనే హత్యాయత్నానికి పాల్పడ్డారని పోలీలకు తెలిపారు.

మొరాయించిన ఈవీఎంలు.. మందకొడిగా సాగిన పోలింగ్

- ఉదయం ఏడు గంటలకే బారులు తీరిన ఓటర్లు
- గెలవలేమని దాడులకు పాల్పడిన టీడీపీ శ్రేణులు
- సమన్వయం పాటించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



అచ్చంపేటలో పోలీసులతో వాగ్వాదానికి పాల్పడుతున్న టీడీపీ శ్రేణులు



అచ్చంపేటలో 7 గంటలకే క్యూలో ఉన్న మహిళా ఓటర్లు

అచ్చంపేట: ఈవీఎంలు మొరాయించాయి. ఫలితం పోలింగ్ మందకొడిగా సాగింది అయినా ఓటర్లు ఓపికతో క్యూ కట్టారు. పోలింగ్ లో పాల్గొనేందుకు గంటల తరబడి నిలుచున్నారు. అచ్చంపేటలో 52, తాడువాయిలోని 36వ నెంబరు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు పనిచేయకపోవడంతో గంటల కొద్దీ లైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలింగ్ స్టేషన్ల వద్ద ఉదయం 7 గంటల నుంచే బారులు తీరారు. అచ్చంపేట, మాదిపాడు, వేల్పూరు, గ్రంథశిరి, చిగురుపాడు, పెదపాలెం బూత్‌లవద్ద పోలీసులు అంతగా లేకపోవడంతో టీడీపీ వర్గీయులు ప్రశాంతవాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నాలకు పాల్పడ్డారు. తరచూ అధికారులతో ఘర్షణ పడటం, వైఎస్సార్ సీపీ శ్రేణుల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. మహిళా ఓటర్లు ఎక్కువగా పోలింగ్ స్టేషన్లకు రావడంతో వారంతా వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓటు వేస్తారని భావించిన టీడీపీ నాయకులు తెగబడ్డారు. ఎలాగైనా పోలింగ్ నిలిపివేసే ప్రయత్నాలు చేశారు.

అర్ధరాత్రి వరకు పోలింగ్

మండలంలోని చిగురుపాడు, ఓర్వకల్లు, అచ్చంపేట, నూరు, కస్తల తదితం గ్రామాలలో సాయంత్రం 7 గంటల సమయంలోనూ ఓటర్లు క్యూలో ఉన్నారు. ఈ ఊళ్లల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

టీడీపీ వర్గీయుల నిర్వాకంతో పోలింగ్‌కు అంతరాయం

అచ్చంపేటలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయులు రాళ్లురువ్వే ప్రయత్నాలు చేయడంతో పోలీసులు మూకలను చెదరగొట్టారు. వేల్పూరు, చిగురుపాడు, గ్రందశిరి, మాదిపాడులలో ఇరువర్గాల మధ్య కొద్దిపాటి గొడవలు జరగడంతో కాసేపు పోలింగ్ నిలిపి వేశారు. మండల కేంద్రమైన అచ్చంపేటలో 66 శాతం ఓట్లు పోలయ్యాయి. అత్యధికంగా మిట్టపాలెంలో 92శాతం, కోగంటివారిపాలెంలో 90శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ బూత్‌లను సందర్శించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పోలింగ్ బూత్‌లను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సందర్శించారు. సంపూర్ణ మెజార్టీతో తాను మళ్లీ గెలవబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు.

ప్రశాంతం.. పోలింగ్ పర్వం



పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన మహిళలు

అమరావతి : మండల పరిధిలోని 69పోలింగ్ బూత్‌లలో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 19 గ్రామాల్లో 58,652 మంది ఓటర్లు ఉండగా 80శాతం మంది ఓటు వేశారు. ఉదయం ఏడుగంటలనుంచి సాయంత్రం 6గంటల వరకు సుమారు 500మందికి పైగా పోలింగ్ సిబ్బంది ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి మహిళలు అధికంగా పోలింగు బూత్‌ల వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం నుంచి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తమతమ అనుచరులతో గ్రామాలలో ఇంటింటికి తిరిగి తిరిగి ఓటు వేయని వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. చెదురుమదురు సంఘటనలు మినహా సజావుగా సాగేలా అమరావతి సీఐ ఎ.వి బ్రహ్మం ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు. మండల కేంద్రమైన అమరావతిలోని 14 బూత్‌లలో 12,552 మంది ఓటర్లకు 9534కు పైగా ఓట్లు పోలయినట్లు ప్రాథమిక సమాచారం.

నెమలికల్లులో మొరాయించిన ఈవీఎం..

నెమలికల్లులోని 261వ బూత్‌లో ఉదయం సుమారు గంటకు పైగా ఈవీఎం మొరాయించింది. దీంతో పోలింగ్‌లో జాప్యం జరిగింది.

ఓటెత్తారు

- పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరిన ఓటర్లు
- ఉదయం 6 గంటలకే క్యూ కట్టిన వైనం
- నియోజకవర్గంలో రాత్రి 7.00 గంటలకు 75.35 శాతం పోలింగ్ నమోదు



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకు వస్తున్న సహాయకులు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సత్తెనపల్లి నియోజకవర్గంలో సోమవారం ఓటు వేసేందు కు ఓటర్లు పోటెత్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా 274 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 2,42,047 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా సోమవారం సాయంత్రం 5 గంటలకు గంటలకు 71 శాతం నమోదు కాగా రాత్రి 7 గంటలలకు 75.35 శాతానికి చేరిందని అధికారులు తెలిపారు.

బూత్ లను పరిశీలించిన అంబటి, అనిల్ కుమార్ యాదవ్

పోలింగ్ బూత్‌లను నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు పరిశీలించారు. మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఏపీఓపై కన్నా ఆగ్రహం

పట్టణంలోని 40వ బూత్‌లో ఓ మహిళను ఓటు వేయాలని సూచించిన ఏపీఓపై టీడీపీ అభ్యర్థి కన్నాలక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానంటూ బెదిరించగా ఆయన కుమారుడు నాగరాజు, మరి కొందరు నాయకులు రెచ్చిపోతూ దూషించారు. నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామంలో ఈవీఎంల ధ్వంసానికి కొందరు పాల్పడ్డారు. పోలింగ్ ప్రక్రియలో జాప్యం నెలకొంది. చీమలమర్రితోపాటు నియోజకవర్గంలో పలు చోట్ల పోలింగ్ రాత్రి వరకు కొనసాగనుంది.

మందకొడిగా ప్రారంభమై..

ఇదిలా ఉంటే పోలింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం 7.00 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా పలుచోట్ల ఈవీఎంల మొరాయింపులు కారణంగా ఆలస్యమైంది. ఉదయం 9.00 గంటలకు 8.25 శాతం పోలింగ్ నమోదు కాగా 11.00 గంటలకు 23.63 శాతం, మధ్యాహ్నం 1.00 గంటకు 41.46 శాతం, మధ్యాహనం 3.00 గంటలకు 57.37 శాతం, సాయంత్రం 5.00 గంట లకు 71 శాతం, రాత్రి 7 గంటలకు 75.35 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో యువత, మహిళలు, ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



నందిగామలో బారులు తీరిన ఓటర్లు

ఓటర్ల బారులు... టీడీపీ దాడులు

- 75త్యాళ్ళూరులో ఓటువేసిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు
- 75త్యాళ్ళూరు, కంభంపాడులో ఉద్రిక్తత
- కంభంపాడులో టీడీపీ మూకల దౌర్జన్యం
- బూత్ నుంచి వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌ను లాగి దాడి
- పెదకూరపాడులో పోలింగ్ సరళి



పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో ఓటేసేందుకు ఓవైపు ఓటర్లు బారులు తీరారు. మరోవైపు పోలింగ్ సరళి వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉందంటూ ఓర్వలేని టీడీపీ నాయకులు దాడులకు తెగబడ్డారు. ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ కట్టారు. పోలింగ్ సమయంలో వృద్ధులు, వికలాంగులను తీసుకెళ్లే విషయంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సాయంత్రం 6 గంటలకు వరకు పెదకూరపాడు నియోజకవర్గంలో 65 శాంత పోలింగ్‌నమోదైంది. పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు బారులు తీరడంతో వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో రాత్రి 10 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ సాగింది.

కంభంపాడు, 75త్యాళ్ళూరులో ఉద్రిక్తత

కంభంపాడులో టీడీపీ కార్యకర్తలు పోలింగ్‌బూత్‌లోకి చొరబడి వైఎస్సార్‌సీపీ ఏజెంట్ అర్తిమళ్ల రాజాను బలవంతగా బయటకు ఈడ్చుకొచ్చారు. రాజా తలపై గాయం చేశారు. దీంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆందోళనలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. టీడీపీ కార్యకర్తల ప్రవర్తనకు ఓటర్లు భయభ్రాంతులకు లోనయ్యారు. 75త్యాళ్ళూరులో టీడీపీ కార్యకర్తలు పలు మార్లు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారు. దీంతో ఇరువర్గాలు మొహరించుకున్నారు. ఇతర గ్రామాలు వారికి మా గ్రామంలో పనేంటి అని వై సీపీ కార్యకర్తలు నిలదీశారు. ఇతర గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు 75త్యాళ్ళూరులోకి వచ్చి అల్లర్లు సృష్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈక్రమంలో టీడీపీ కార్యకర్తలు కాలచక్ర రోడ్డు పక్కన ఉన్న హోటల్‌లను ధ్వంసం చేశారు. ఇరువర్గాల దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. లగడపాడులో ఓట్లు వేసే ప్రక్రియలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది.సమస్యాత్మక గ్రామాలైన గారపాడు, లింగంగుంట్ల పోలింగ్ ప్రశాంతగా జరిగింది. పెదకూరపాడు ఎస్సీ కాలని బూత్‌లో టీడీపీ కార్యకర్త, వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేశాడు.

75త్యాళ్ళూరులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే దంపతులు...

పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు గ్రామంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆయన సతీమణి నంబూరు వసంత కుమారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన కుమారుడు కళ్యాణ్ చక్రవర్తి అమరావతి మండలం ఎన్నికపాడులో ఓటు వేశారు. పెదకూరపాడు గడ్డపై మరోమారు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ ఏజెంట్ పై దాడి

పెదకూరపాడు 167,168 బూత్ వద్ద రాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైఎస్సార్ సీపీ ఏజెంట్ పిల్లి వెంకటేశ్వర్లుపై టీడీపీ ఏజెంట్లు దాడి చేసి గాయపరిచారు. వెంకటేశ్వర్లును ప్రాథమిక చికిత్స నిమిత్తం పెదకూరపాడు తరలించారు. అనంతరం సత తీసుకెళ్లారు. ఈ ఘటనపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఘటనకు బాధ్యులైన టీడీపీ ఏజెంట్లను పోలీసులు వారి ఇళ్లకు తరలించారు.



గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత రాజా



గారపాడులో క్యూలో ఉన్న మహిళ ఓటర్లు

తొలి ఓటు సంబరం

మొదటిసారి ఓటేసిన యువతలో వెల్లివిరిసిన ఉత్సాహం

సత్తెనపల్లి: సోమవారం నాటి పోలింగ్ లో తొలిసారి ఓటేసిన యువత ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాల వైపు అడుగులు వేశారు. తమకు నచ్చిన అభ్యర్ధిని ఎన్నుకునే అవకాశం వచ్చిందనే ఆనందంతో ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. పట్టణంలో మొదటిసారి ఓటేసిన యువత అభిప్రాయాలు వారి మాటల్లోనే..

సంతోషంగా ఉంది



మా అక్క, మా అమ్మతో కలిసి ఓటేసేందుకు వచ్చా. జీవితంలో చెదిరిపోని జ్ఞాపకంగా భావిస్తున్నా. నాతోపాటు చాలా మంది స్నేహితులు తొలిసారి ఓటేస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. రెట్టింపు ఉత్సాహంతో ఓటేశాను.

–మారెళ్ళ శ్రుతి, బీటెక్ విద్యార్థిని, సత్తెనపల్లి

మంచి వారికే ఓటు వేశా



నాకు తొలి సారి ఓటు వచ్చింది. సమాజానికి మేలు చేసే వారికే ఓటేశాను. ఎవరైతే ప్రజలకు మంచి పాలన అందించగలుగుతారో అలాంటి వారికే నా ప్రాధాన్యమని ఎప్పటినుంచో అనుకునేవాణ్ని. ఈసారి అవకాశం వచ్చింది. వినియోగించుకున్నాను.

–పెరుమాళ్ళ ఈశ్వర్, బీటెక్ విద్యార్థి, సత్తెనపల్లి

నిజాయితీకే నా ఓటు



నిస్వార్థ నిజాయితీపరులకు నా తొలి ఓటు. సమాజ సంక్షేమానికి కృషి చేసే దిశగా ఎవరైతే ఆలోచిస్తారో అలాంటి వారికే నా తొలి ప్రాధాన్యం. ఎంతో ఆత్రుతతో ఎదురు చూశా. నా కల నెరవేరింది. ఇకపై ప్రతి ఎన్నికల్లో తప్పకుండా ఓటేస్తా.

–చిల్లంచర్ల చంద్ర శుభశ్రీ, సత్తెనపల్లి

వజ్రాయుధాన్ని ఉపయోగించా



వజ్రాయుధం లాంటి ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎన్నికల్లో చెబుతారు. నేను కూడా ఎప్పుడు ఓటేస్తానా అని ఎదురు చూశాను. ఇప్పుడు ఆ గొప్ప ఆయుధాన్ని ఉపయోగించాను. కొత్తగా అనిపించింది.

–ఎస్.కార్తీక్, బీటెక్ విద్యార్థి సత్తెనపల్లి

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూశా



తొలి ఓటు ఎప్పుడెప్పుడు వేస్తానా అని ఎదురు చూశాను. ఆ క్షణాలు రానే వచ్చాయి. ఉదయాన్నే స్నేహితులతో కలిసి ఓటేసేందుకు వెళ్లాను. తొలి ఓటు కంగారు అనిపించినా నిక్కచ్చిగా వేశాను.

–గుజ్జర్లపూడి అనుపమ్, విద్యార్థి, సత్తెనపల్లి

విలువైనదిగా భావిస్తున్నా



నేను చెన్నైలో బీటెక్ చేస్తున్నా. తొలి సారి ఓటు రావడంతో చెన్నై నుంచి వచ్చా. నా తొలి ఓటు నేను సక్రమంగా వినియోగించుకున్నానని భావిస్తున్నా. పోలింగ్ బూత్ లోకి వెళ్ళగానే కొంత బెదురు అనిపించింది. అయినా తొట్రుపాటు లేకుండా మంచి నిర్ణయం తీసుకున్నా. నేను ఓటేసేవాళ్లే అధికారంలోకి రావాలని భావిస్తున్నా.

–గంగరాజు విష్ణుశరత్, బీటెక్, సత్తెనపల్లి

రాజమండ్రి నుంచి వచ్చా



నేను రాజమండ్రీలో బీడీఎస్ చదువుతున్నాను. ఫస్ట్ టైం నాకు ఓటు హక్కు వచ్చింది. ఓటు వేసేందుకు రాజమండ్రి నుంచి వచ్చా. తొలి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉంది. మా స్నేహితులందరూ ఓటేసేందుకు సొంత ఊళ్లకు వెళ్లారు. పదిమంది మేలు కోరే నాయకునికే నా ఓటు.

–విప్పల శ్రావ్య, బీడీఎస్ విద్యార్థిని, సత్తెనపల్లి

దాడులు... దౌర్జన్యాలు

- పోలింగ్ బూత్‌లలో టీడీపీ శ్రేణుల దాడులు
- అడుగడుగునా కన్నా అనుచరుల దాష్టీకాలు
- టీడీపీ మూకల దాడిలో వైఎస్సార్ సీపీ ఏజెంట్లు, నాయకులకు తీవ్రగాయాలు



హోసనాబాద్‌లో క్యూ లైన్లలో నిల్చున్న మహిళలు



తలకట్టుతో ఉన్న మర్రి సుబ్బారెడ్డి

సత్తెనపల్లి: టీడీపీ నేత కన్నాలక్ష్మీనారాయణ అనుచరులు పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో రక్తపాతం సృష్టించారు. వైఎస్సార్ సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు లాగి, తలలు పగలగొట్టారు. పార్టీ నేతలపై హత్యాయత్నాలతో భయభ్రాంతులకు గురి చేశారు. జగనన్న సంక్షేమానికి ఓటర్ల నుంచి వెల్లువలా సానుకూలత లభించడంతో టీడీపీ నైరాశ్యంలోకి వెళ్లిపోయింది. చేసేదిలేక హింసను ప్రేరేపించింది. గత ఐదేళ్ల ప్రశాంతతకు అలవాటు పడిన పల్లెలపై రౌడీయిజం ఝుళిపించారు. పోలింగ్ బూత్ లలో మారణాయుధాలతో తెగబడ్డారు. అయినా వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు సమయమనం పాటించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేశారు.

వైఎస్సార్ సీపీ ఏజెంట్లపై దాడి

నియోజకవర్గంలోని ముప్పాళ్ళ మండలం నార్నెపాడులో 238వ పోలింగ్ బూత్‌లో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ ఏజెంట్ పై దాడి చేసి చొక్కా ను చింపారు. ఆ ఏజెంట్‌తో మాట్లాడి బూత్ లోకి పంపించేందుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ చీఫ్ ఏజెంట్, మంత్రి అంబటి అల్లుడు ఉపేష్ చంద్ర పైనా దాడి చేశారు. కారును వెంబడించి రాళ్లతో అద్దాలు పగులగొట్టారు. మండల కేంద్రంలో 247వ పోలింగ్ బూత్‌లో తప్పుడు ఓటింగ్ ను అడ్డుకున్నందుకు వైఎస్సార్ సీపీ ఏజెంట్ యనమాల క్రీస్తు దాసుపై టీడీపీ ఏజెంట్లు , స్థానిక నాయకులు మరణాయుధాలతో దాడి చేసి తల పగలగొట్టారు. మాదల 264 పోలింగ్ బూత్‌లో దొంగ ఓట్లు అడ్డుకున్న వైఎస్సార్ సీపీ ఏజెంట్ల పై ఘర్షణ జరుగుతుండగా సర్ది చెప్పేందుకు వెళ్లిన గుంటూరు సర్దార్ పై టీడీపీ వర్గీయులు దాడి చేసి తల పగలగొట్టారు. దమ్మాలపాడు 253 వ పోలింగ్ బూత్ లో ఒక ఓటు మాత్రమే వేయించి మరో ఓటు టీడీపీ వర్గీయులు వేసుకొని అక్రమాలకు పాల్పడ్డారు. నకరికల్లు మండలం గుడ్లపల్లి ఉర్దూ స్కూల్ లో జరిగిన ఘర్షణలో మండల యూత్ అధ్యక్షుడు గుత్తి కొండ నన్నేసాకు చేయి విరిగింది. రాజుపాలెం మండలం గణపవరంలో టీడీపీ సానుభూతి పరురాలైన నర్రా మౌనిక 151లో ఓటు వేసి మళ్లీ 152 పోలింగ్ బూత్ లో మరో ఓటు వేసేందుకు వెళ్లగా వైఎస్సార్ సీపీ ఏజెంట్లు అడ్డుకున్నారు.ఈ క్రమంలో ఘర్షణ జరుగుతుండగా తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి సర్ది చెప్పేందుకు వెళ్లగా అతనిపై ఆకస్మికంగా దాడికి దిగారు. కర్రలతో దాడి చేసి తల పగలగొట్టారు. ఇలా అనేక పోలింగ్ బూత్ లలో టీడీపీ శ్రేణులు, అల్లరి మూకలు ఘర్షణ లకు దిగి భయభ్రాంతులకు గురి చేశారు.




దాడిలో గాయపడిన మధిర శివారెడ్డి



గాయపడిన యనమాల దాసు

ముప్పాళ్ళ: తొండపి గ్రామంలోని ముస్లిం ఏరియా పోలింగ్ కేంద్రం పైకి తెలుగుదేశం పార్టీ శ్రేణులు మూకుమ్మడిగా దాడికి దిగాయి. ముస్లిం కుటుంబాల ఇళ్ళలోకి చొరబడి భయభ్రాంతులకు గురి చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు దిగారు. సుమారు ఇరవైకి పైగా ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన బందెల బుడేసా, జానిబాషా, బందెల బాజి, షేక్ నాగూర, గాలిసైదు, బందెల సైద, బందెల బుడాలతో పాటు మరో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రమైన ముప్పాళ్ళలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన వివాదంలో చాగంటివారిపాలేనికి చెందిన మధిర శివారెడ్డిని ముప్పాళ్ళకు చెందిన ముస్లిం యువకులు దాడి చేసి గాయపరిచారు. చాగంటివారిపాలెం లోని 242 పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన వివాదం నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ, సత్తెనపల్లి కి చెందిన రౌడీషీటర్లతో నానాయాగీ సృష్టించారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన మంత్రి అంబటి రాంబాబు పై రాళ్ళ దాడికి దిగారు. ఈ దాడిలో పోలీసు వాహనం ధ్వంసం కాగా, పలువురికి తీవ్రగాయాలయ్యాయి. గోళ్ళపాడు పోలింగ్‌కేంద్రం వద్ద గుమికూడిన వారిని పోలీసులు తరిమే ప్రయత్నంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. దీంతో టీడీపీ నాయకులు ఆందోళనకు దిగారు. మాదలలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఇళ్ళపై టీడీపీ శ్రేణులు రాళ్ళ దాడికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.





నర్రా మౌనిక పేర్లు ఉన్న ఓటరు లిస్టులు 151,152

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గంలో సోమవారం నాటి పోలింగ్ కు అనూహ్య స్పందన లభించింది. పోలింగ్ కేంద్రాల ఆవరణలో మహిళలు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం వాతవరణం చల్లగా ఉండటంతో పోలింగ్ సజావుగా సాగింది.మధ్యాహ్నం నుంచి పోలింగ్ బూతుల వద్ద మహిళల జోరు ఊపందుకుంది.

ఓటింగ్ ప్రక్రియ నిలిపేసేందుకు టీడీపీ ఎత్తుగడలు:

మండలంలోని దొడ్లేరు జెడ్పీపాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగించేందుకు టీడీపీ నాయకులు తీవ్రప్రయత్నాలు చేసారు. ఈ క్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు అవుల అంకిరెడ్డిపై దాడి చేసారు.